క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న సంఘటన కొల్లూరు సమీపంలో కరకట్టపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కృష్ణానదీ తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండటంతో సెబ్ అధికారులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సెబ్ అధికారులు స్వాధీనం చేసిన ట్రాక్టర్‌పై సెబ్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు



ఓలేరు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడమే కాక ఆరోగ్యవంతమైన రసాయనాలు లేని పంట ఉత్పత్తులను సాధించవచ్చునని ప్రాజెక్ట్ రీసోర్స్‌పర్సన్ శివనాగేశ్వరమ్మ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన మేరుగ వెంకట ప్రసాద్ ఇంటి వద్ద బుధవారం గ్రామ సంఘం ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకులు, అలములుతో అగ్ని అస్త్రం తయారు చేసే విధానాన్ని రైతులకు చూపారు. మేరుగ ప్రమీలా రాణి, ఐసీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



భట్టిప్రోలు: స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరిలు కోరారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విజన్ బిల్డింగ్ కార్యక్రమంపై గ్రామ సంఘాల అధ్యక్షులకు నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు కొలకలూరి రజనీ కుమారి, కొండెపాటి సాంబయ్య, దాసరి హనోకు, అకౌంటెంట్ బత్తుల శిరీష, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటినుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన దారం శ్రీనివాసరావు బుధవారం నోట్ పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు, స్టేషనరీ అందజేశారు. శ్రీనివాసరావు భార్య దారం జయమ్మ వర్ధంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటిని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం జనార్దన్, ఎస్ఎంసీ చైర్మన్ గుండాల ఎస్తేరురాణి, దారం నాగభూషణం, కారుమంచి కిషోర్, దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బాలల హక్కులు, రక్షణ యంత్రాంగాలపై శిక్షణ



వేమూరు: మానవ జీవితంలో బాల్యదశ అపూర్వమైనదని మండల విద్యా శాఖాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్రంట్ లైన్ గవర్నమెంట్ వర్కర్స్‌కి బాలల హక్కులు, బాలల రక్షణ యంత్రంగాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ బాలల కోసం బాలల రక్షణ యంత్రాంగాలు పనిచేస్తున్నాయన్నారు. గ్రామ ఉప సర్పంచ్ తలతోటి ప్రదీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణ, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి, క్లస్టర్ మేనేజరు శ్రీనివాసరావు, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కీర్తన పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం గుర్తించారు. లారీ యజమానికి రూ. 10 వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు



రేపల్లెలో అన్నపూర్ణాదేవిగా బూరుగులమ్మ అమ్మవారు



ఇసుకపల్లిలో వైష్ణవీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



భట్టిప్రోలులో ప్రత్యేక అలంకారంలో గుండిపార్వతి అమ్మవారు



వెల్లటూరులో మహాలక్ష్మమ్మ అలంకారంలో..



కొల్లూరు లాక్ సెంటర్‌లో పంచముఖ గాయత్రి అలంకారంలో కనకదుర్గమ్మ

- పలు రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
- దర్శించుకుని తరించిన భక్తులు

రేపల్లె రూరల్: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం నాల్గవరోజు పట్టణంలోని వివిధ దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఓల్డ్‌టౌన్‌లో వేంచేసియున్న గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ అమ్మవారు వైష్ణవీదేవిగా, స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు మంగళగౌరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పేటేరులో గ్రామదేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా స్వయం భూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలచే ఏర్పాటు చేసిన బతుకమ్మ అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. ఆయా దేవాలయాల కమిటీల సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రత్యేక అలంకారాలలో అమ్మవార్లు..

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లు మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. రూ.3లక్షల నగదుతో అమ్మవార్లను అలంకరించారు. అలాగే ఐలవరంలో కొలువైన కామాక్షి రెడంకమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భట్టిప్రోలు మల్లేశ్వరస్వామి దేవాలయంలో భమరాంబ అమ్మవారు కూష్మాండాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భట్టిప్రోలు హిందూ స్మశానవాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో



చందోలు బండ్లమ్మ దేవాలయంలో గాయత్రీ దేవి అలంకారంలో..



చినపరిమిలో గాయత్రీ దేవి అలంకారంలో పార్వతి దేవి



మహాలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు

అమ్మవారు రుద్రశక్తి అలంకారంలో, శ్రీ పార్వతి అమ్మవారు శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. దేవస్థాన అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు. షిర్డీ సాయిబాబా మందిరంలో బాబా వారికి గంధాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు పర్యవేక్షించారు.

గాయత్రీ దేవిగా ..

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం పార్వతి దేవి అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కొల్లూరులో...

కొల్లూరు: దసరా ఉత్సవాలు కొల్లూరు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. కొల్లూరు లాక్ సెంటర్ ప్రాంతంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం పంచముఖ గాయత్రి అమ్మవారి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు..

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండలంలోని పలు గ్రామాలలో గల దేవాలయాలలో బుధవారం శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి దేవాలయంలో పార్వతీదేవిగా అలంకరించారు. చందోలు గ్రామంలో వేంచేసిఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని గాయత్రీదేవి అలంకారం చేశారు. చందోలు బండ్లమ్మ దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

బాపట్ల పట్టణంలో..

బాపట్ల అర్బన్: అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బాపట్ల పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని లలితాత్రిపుర సుందరీపీఠం ఆధ్వర్యంలో మంగళవారం మహాలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పంగులూరి కొండిన్యశర్మ, దర్శి ప్రశాంత్, శివన్నారాయణ, వక్కలగడ్డ బాలాజీ, భక్తులు పాల్గొన్నారు.

మోదుకూరులో..

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలం మోదుకూరు గ్రామంలోని శ్రీ కనకదర్గాంబ సమేత రామ చౌడేశ్వరి దేవస్థానంలో బుధవారం పర్వత వర్ధినిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజ కార్యక్రమాలను అర్చకుడు మామిళ్ల నాగేశ్వర శర్మ నిర్వహించారు.

నవంబర్ 12న పోలు రాధా ఎడ్ల పోటీలు

భట్టిప్రోలు: శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి (భట్టిప్రోలు) ఆధ్వర్యంలో మండల స్థాయి పోలు రాధా ఎడ్ల పోటీలు నవంబర్ 12వ తేదీన స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీలోగా పోటీదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతుల కింద రూ.15,116, రూ.10,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116 అందించనున్నట్లు తెలిపారు. పోటీలు డ్రా పద్ధతిలో నిర్వహిస్తామని, టైరు బండి తోలుకునే ఎద్దుల వరకు ఈ పోటీలలో అనుమతిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63006 53089, 96182 06050 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సమగ్ర భూ రీసర్వేతో బహుళ ప్రయోజనాలు



నగరం: సమగ్ర భూ రీసర్వేతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. మండలంలోని పెద్దవరం గ్రామంలో సమగ్ర భూ రీసర్వే పూర్తికావడంతో హద్దు రాళ్లను రెవెన్యూ సిబ్బంది బుధవారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సమగ్ర భూ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూర్చుతాయన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి భూ సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రీసర్వేతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ స్మశాన వాటికలో బెడ్డు ఏర్పాటు

భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ స్మశానవాటిక దహన శాలలో కింది భాగం దెబ్బతినడంతో మృతదేహాలను ఆరుబయట దహనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ 16వ వార్డు సభ్యులు వంగర వీరయ్య ముందుకు వచ్చి తన సొంత ఖర్చులు రూ.35 వేల వ్యయంతో బెడ్డును వేయించారు. ఇందుకు ఇసుక, సిమెంటు, కంకర సమకూర్చారు. వర్షం వస్తే మృతదేహాలను దహనం చేయడం ఇబ్బందిగా మారడంతో తన వంతుసాయంగా బెడ్ వేయించినట్లు వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యులు వీరయ్యను పలువురు అభినందించారు.

ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండల పరిధిలోని ఆరుంబాక పంచాయతీ యేమినేనివారిపాలెంలో బుధవారం ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఎంపీ మోపిదేవి ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదప్రజల కోసం ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి పేదప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆమహనేత రాజన్న అడుగుజాడల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు పూర్తిస్థాయి ఆరోగ్యం చేకూరాలన్న ముఖ్య ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని వారికి సంపూర్ణ వైద్యం అందించేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరంలో 505 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ రవిప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ కామినేని కోటేశ్వరావు, ఎంపీటీసీ రావూరి సునీత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైనం ఏడుకొండలరెడ్డి, నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెసర్లంకలో 405 మందికి వైద్య పరీక్షలు..

కొల్లూరు: మెరుగైన వైద్య సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందజేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పలువురు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెసర్లంక జరిగిన వైద్యశిబిరంలో 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు బి.రాజ్‌కుమార్, ఎస్.సుష్మ, వి.కావ్యతేజ, మౌనిక, పావనిలు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కంటి చూపు సమస్యతో ఇబ్బంది పడుతున్న పలువుర్ని పరిశీలించి కళ్లజోళ్లు అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఉప్పూడిలో 320 మందికి వైద్యసేవలు..

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పూడి గ్రామంలో సర్పంచ్ గుజ్జర్లమూడి విజయబేబి ఆధ్వర్యంలో మండల ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యబృందం 320 మందికి వైద్యసేవలు అందించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుజ్జర్లమూడి ఇమ్మానుయేలు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కైతేపల్లిలో..

మండలంలోని కై తేపల్లి ఎంపీపీ స్కూలులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏలేటిపాలెంలో..

నగరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. మండలంలోని ఏలేటిపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు వైద్యసేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు దుర్గాప్రసాద్, నజీల్లా పరీవ్స్, గ్రామ సర్పంచ్ పఠాన్ జాఫర్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కోటేశ్వరావు, సీహెచ్ఓ బాబురావు, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్తుపల్లిలో 400 మందికి పరీక్షలు..

నిజాంపట్నం: ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యసేవలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు తెలిపారు. మండలంలోని ముత్తుపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరనాథబాబు మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పలువురు వైద్యులు 400 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నక్రా సుబ్బయ్య, సర్పంచ్ పిట్టు ఏడుకొండలు రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పెసర్లంకలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



ముత్తుపల్లిలో జగనన్న సురక్ష కిట్‌ల పంపిణీ

పెదగొల్లపాలెంలో 300 మందికి పరీక్షలు..

కర్లపాలెం: ప్రజలందరికీ ఉచితంగా వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు తెలిపారు. బుధవారం పెదగొల్లపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు సుహానా బేగం, రమ్య 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ యల్లావుల సురేష్ రాదవ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, మల్లెల ఆదాం, ఈఓపీఆర్డీ ఎలీషా బాబు ఉన్నారు.

20న గుంటూరులో మాదిగల మహాసదస్సు

కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ నన్నెపాముల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కో–కన్వీనర్ నన్నెపాముల నాగేశ్వరరావు, నాయకులు

భట్టిప్రోలు: ఎస్సీ వర్గీకరణ, సంక్షేమం, రాజకీయ వాటాకై ఈ నెల 20న గుంటూరులో నిర్వహిస్తున్న మాదిగల మహా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ నన్నెపాముల నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు బౌద్ధస్థూపంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా మాదిగలు సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ జనాభా ప్రాతిపదికన కులాల వారీగా విభజన చేసి మాదిగలకు రావాల్సిన వాటాను రాబట్టుకునేందుకు జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై హక్కులను సాధించుకునేందుకు పోరాటం కొనసాగించుకోవాలని పేర్కొన్నారు. గుంటూరులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొల్లూరు సురేష్ బాబు, కోన శ్రీనివాసరావు, రాష్ట్ర కన్వీనర్ యేటుకూరి విజయ్‌కుమార్, జిల్లా నాయకులు కటికల కళాకరరావు, కొమరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే రోల్‌మోడల్‌గా రాష్ట్రం

- రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు
- యేమినేనివారిపాలెంలో ఆర్బీకే, హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి మండలం ఆరుంబాక పంచాయతీ పరిధిలోని యేమినేనివారిపాలెంలో రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్బీకే, రూ.21.5 లక్షల వ్యయంతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను బుధవారం మోపిదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన రాష్ట్రం దేశంలోనే ఎన్నో రంగాల్లో ప్రథమస్థానంలో ఉందని అన్నారు. ఏపీని ఎన్నోరాష్ట్రాలు రోల్ మోడల్‌గా తీసుకుంటున్నాయని అన్నారు. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, వ్యవసాయ సలహాలు, సూచనలు ఆర్బీకేలో, వైద్యసేవలు హెల్త్ సెంటర్‌లో పొందవచ్చునని తెలిపారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి సునీత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పయనం ఏడుకొండల రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చీరాల ప్రసాదరెడ్డి, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ షేక్ ఫిరోజ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ రెడ్డి రోశమ్మ మృతి

రేపల్లె: రేపల్లె మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రెడ్డి రోశమ్మ(93) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. పట్టణంలోని 7వ వార్డుకు చెందిన రెడ్డి రోశమ్మ 2005 నుంచి 2010 సంవత్సరాల మధ్య ఆ వార్డుకు కౌన్సిలర్‌గా పనిచేశారు. రోశమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో రెడ్డి శివశంకర్ 7వవార్డు కౌన్సిలర్‌గా సేవలు అందిస్తున్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శంకర్‌నాయక్

పిట్టలవానిపాలెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పేదలు ధీమాగా జీవించవచ్చని డీఆర్‌డీఏ పీడీ శంకర్ నాయక్ అన్నారు. మండలపరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఏడాదికి 100 రోజులు ఉపాధి హామీ పథకం కింద కూలి పనులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజూ రూ.270 కూలి నిర్ణయించినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆయా గ్రామాల నివేదికలను చదివి వినిపించారు. మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల విలువ గల పనులను కూలీలకు కల్పించామని తెలిపారు. గ్రామాలలో సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డీఎల్‌డీఓ చంద్ర సువార్త, ఎంపీడీఓ శేషమాంబ, ఏపీఓ సుభాషిణి, ఈఓపీఆర్డీ పద్మజ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఫీల్డు అసిస్టెంట్‌లు గోవిందరెడ్డి, గోపి, శ్రీనివాసరెడ్డి, శివరావు, కూలీలు ఉన్నారు.



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు